క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి

డోన్ టౌన్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించమని, ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం పట్టణంలోని రౌడీ షీటర్లకు ఎస్‌ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందని, ప్రశాంతంగా జీవనం సాగించాలని సూచించారు. మట్కా, పేకాట, సారా తయారీ తదితర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపడితే శిక్షి తప్పదన్నారు. పట్టణం విడిచి ఎక్కడికి వెళ్లినా పోలీసు స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా సమాచారం అందజేయాలని సూచించారు.

ఏసు బాటలో నడవాలి



మాట్లాడుతున్న పాస్టర్

ప్యాపిలి: క్రైస్తవులు ప్రభువు ఏసుక్రీస్తు చూపిన బాటలో నడవాలని పాస్టర్లు మనషయ్య, తిమోతి సూచించారు. స్థానిక ఎలీయం ప్రార్థన మందిరం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం పాస్టర్లు మాట్లాడుతూ ఏసుక్రీస్తు తన జీవితం ద్వారా మానవాలికి విలువైన సందేశాలు అందించారన్నారు. తోటి వారి పట్ల ప్రేమ దయ,జాలి కరుణ కలిగి ఉండాలన్నారు. బైబిల్ సందేశాలను అనుసరిస్తూ జీవన శైలిని ఉన్నతంగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు ఆనందరావు, సువర్ణరావు, ఇమ్మానియేలు, జోసఫ్, డేవిడ్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రదర్శనలతో సాంకేతిక పరిజ్ఞానం



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రభాకర్

డోన్ టౌన్ : సైన్స్ ఎగ్జిబిషన్‌ల ఏర్పాటుతో విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతుందని ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు. పట్టణ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల్లో ఆదివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎంఈఓ ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు వివిధ స్టాళ్లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సందేశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను చూసేందుకు వచ్చిన అనుమతించకపోవడంతో ఉపాధ్యాయుల తీరుపై తల్లిదండ్రులను ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులకు కూడా అనుమతి ఉంటుందని ప్రకటనలు చేసి గేటు బయటి నిలువరించడం సమంజసం కాదని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ గీతా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

19న జైహో జాతీయ సమ్మేళనం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

డోన్ టౌన్ : నెల్లూరు పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన ఉన్న మహాత్మాగాంధీ ఆశ్రమంలో ఈ నెల 19న నిర్వహించనున్న జైహో రెండవ జాతీయ సమ్మేళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం సమ్మేళనం పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జాతీయ ఉద్యమ స్ఫూర్తితో జాతిని ఏకం చేసేందుకు మతోన్మాదుల్ని నిర్మూలించేందుకు జాతీయ స్థాయిలో నిర్మాణం అవుతున్న జైహోను బలపరచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జై భారత్ జిల్లా కార్యదర్శి చరణ్, ఉపాధ్యక్షుడు రామచంద్రుడు, నాయకులు నరసింహా, చంటి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నేల బెలుంలో తిరునాల

కొలిమిగుండ్ల: కార్తీక మాసం కడ సోమవారం సందర్భంగా బందార్లపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో తిరునాల మహోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయానికి ఎదు రుగా ఉన్న బిళంలో భక్తులు స్నానాలు ఆచరించేందు కు అనుగుణంగా లోపల లైటింగ్ ఏర్పాటు చేశా రు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి ఆధ్వర్యంలో చింతలాయిపల్లె గ్రామపెద్దలు, ప్రజలు, దాతల సహకారంతో అన్నదానం చేయనున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- అన్నిరంగాల్లో వారికి ప్రాధాన్యం
- స్త్రీలను రైతులను చేస్తున్న ప్రభుత్వం
- పేదమహిళలకు భూ పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



బనగానపల్లె : భూ పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని



అవుకు: మహిళకు భూ పట్టాను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ /అవుకు: మహిళల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. స్త్రీలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యతనిస్తున్నారని, రాజకీయ అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి ప్రభుత్వ పథకాన్ని మహిళల పేరిట వర్తింపజేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తున్నారని, ఏకంగా స్త్రీలను మహిళా రైతులను చేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. బనగాలనపల్లెతోపాటు అవుకు మండలంలో ఆదివారం ఎమ్మెల్యే కాటసాని మహిళలకు భూ పంపిణీ చేశారు. బనగానపల్లె ఎంపీడీఓ కార్యాలయ సమావేశం భవనంలో పలుకూరు, రామతీర్థం, బీరవోలు, చెరువుపల్లె గ్రామాలకు చెందిన మొత్తం 532 మంది మహిళలకు జగనన్న భూ పంపిణీ కింద 896.99 ఎకరాల భూ పట్టాలను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. అదేవిధంగా అవుకు రెవెన్యూ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో అవుకు పట్టణంలోని 244 మంది మహిళలకు భూ పట్టాల పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కాటసాని ఓబుల్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, అవుకు సొసైటీ చైర్ పర్సన్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డితో కలిసి మహిళలకు ఎమ్మెల్యే పట్టాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే కాటసాని ప్రసంగించారు. జగనన్న పాలనలో మహిళలే మహారాణులు అని, ప్రతి కుటుంబంలోనూ స్త్రీలకే ప్రాధాన్యతనిస్తూ వారి ఖాతాల్లోనే సంక్షేమ ఫలాల నగదును జమ చేస్తున్నారని, వారి పేరిటనే ప్రభుత్వ లబ్ధి పత్రాలను అందజేస్తున్నామని గుర్తు చేశారు. గతంలో దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలకు భూపట్టాలను పంపిణీ చేశారని, ఆయన అడుగు జాడల్లోనే నడుస్తూ ఎన్నికల ముందు చేసిన పాదయాత్రలో రైతుల కష్టాలను దగ్గరుండి చూసి సాగులో ఉన్న వారికి భూ పట్టాల పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నారన్నారు. అదేవిధంగా అసైన్డ్ భూమలు ఇవ్వాలని భావించారన్నారు. మాట ప్రకారం రాష్ట్రంలో భూ పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారని తెలిపారు. భూములు పొందిన మహిళలు ఇక బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చని, పంట నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి పరిహారం పొందవచ్చునని, అలాగే రైతు భరోసా పొందవచ్చునని తెలిపారు. ప్రభుత్వం అందజేసిన భూములను సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమంలో సర్పంచ్ మందా గుర్రమ్మ, గ్రామసచివాలయ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం, నాయకులు చల్లా చరణ్ రెడ్డి, ముక్కమళ్ల పుల్లారెడ్డి, కంపిలి నారాయణ, గంగాధర్, మద్దిలేటి గౌడ్, పురుషోత్తం నాయుడు, చిన్న కంబగిరి స్వామి, మేకల ఈశ్వర్ రెడ్డి, బనగానపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లాయువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, రామతీర్థం సర్పంచ్ సురేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాసీం, పుల్లయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

అసమర్థుడు... నువ్వా... నేనా?

- జీసీపై ధ్వజమెత్తిన కాటసాని

పేదలు మేలు జరుగుతుంటే ఓర్వలేని టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి తన ఉనికిని కాపాడుకునేందుకు అర్థరహిత విమర్శలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ధ్వజమెత్తారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చాం... ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేశాం అని మేము ధైర్యంగా చెప్పగలమని... నీవు ఆ విధంగా చెప్పుకుంటే ఏ సమస్య ఉండదని, అసమర్థుడు... ఏమి అభివృద్ధి చేయలేదు అని మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు. పేదల అభివృద్ధిని అడ్డుకున్నది ఎవరో ప్రజలకు బాగా తెలుసన్నారు. బనగానపల్లె, అవుకులో నిర్వహించిన భూ పంపిణీ కార్యక్రమాల్లో బీసీ తీరుపై కాటసాని మండిపడ్డారు. ప్రత్యేకించి అవుకులో బీసీపై తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా ఉన్న నీవు(బీసీ జనార్దన్‌రెడ్డి) అవుకు పట్టణంలో ఒక్క అడుగు సీసీ రోడ్డు నిర్మించావా అని నిలదీశారు. తాను అవుకు పట్టణంలో రూ.1.48 కోట్లతో సీసీ రోడ్లను వేయించానని, రూ.1.20 కోట్లతో కమ్యునిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టామని, రూ.22 లక్షలతో ముస్లింల శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టామని గుర్తు చేశారు. త్వరలోనే రూ.75లక్షలతో మరికొన్ని చోట్ల సీసీ రోడ్డు నిర్మాణాలు చేపడతామని, ప్రతి ఇంటికి తాగునీరు సక్రమంగా అందాలనే ఉద్దేశంతో కొండ మీద 2లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అంతేకాకుండా ఇప్పటికే 200 మందికి ఇళ్ల పట్టాలు, 244 మందికి భూపట్టాలు పంపిణీ చేశామని, ఇంకా అర్హత ఉన్నవారికి త్వరలోనే ఇళ్ల పట్టాలు, భూ పట్టాలను అందజేస్తామన్నారు. ఇంత అభివృద్ధి చేసిన నేనా.. ఏమీ చేయని నీవా... అసమర్థుడు అంటూ నిలదీశారు. ప్రజలకు మేలు చేసేందుకు ప్రతి పక్షనాయకులు విమర్శించడం సహజమని, అయితే పేదలకు జరిగే లబ్ధిని కూడా అడ్డుకున్న రాష్ట్రంలోనే ఏకైక వ్యక్తిగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దరెడ్డి చరిత్రలో నిలిచిపోతాడని ఎద్దేవా చేశారు. బనగానపట్టణంలో ఇంటి పట్టాల పంపిణీకి, కొలిమిగుండ్లల భూ పంపిణీకి తాను సర్వం సిద్ధం చేయగా కోర్టుకెళ్లి అడ్డుకట్ట వేసిందేవరో ప్రజలకు బాగా తెలుసన్నారు. ఇలాగే పేదల అభివృద్ధిని అడ్డుకంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కాటసాని హెచ్చరించారు.

వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటా..



సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మా కుటుంబం అంతా రుణపడి ఉంటాం. పేదరికంతోపాటు సెంటు భూమి లేనందున ఎన్నోసార్లు తనను అపహాస్య చేశారు. జగనన్న ఆదుకున్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా నా బిడ్డను చదివించుకుంటున్నా. జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరైంది. నేడు దేవుడిలా జగనన్న ఎకరా అసైన్డ్ భూమి ఇచ్చారు. మహిళా రైతునయ్యా. సీఎంతోపాటు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు.

–మాదవి, లబ్ధిదారురాలు, అవుకు.

మహిళలందరూ ఏకతాటిపై ఉండాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యతనిస్తుంది. సీఎం జగనన్న మహిళలను రాజకీయంగానూ ప్రోత్సహిస్తున్నారు. మహిళల స్థితిగతులు చాలా మెరుగుపడ్డాయి. ఎకర భూమికి సంబంధించి పట్టా అందజేసి యాజమానిని చేశారు. మహిళల కోసం ఇంతలా చేసిన ముఖ్యమంత్రి ఎవ్వరూలేరు. ఏకతాటిపై ఉండి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

– పద్మావతి, లబ్ధిదారురాలు, అవుకు,

సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



నాకు ఎలాంటి వ్యవసాయ భూమిలేదు. నా భర్త శ్రీనివాసులు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు చేదోడుగా నేనూ కూలి పనుల వెళ్తున్నా. ప్రస్తుతం జగనన్న భూ పంపిణీలో భాగంగా 1.90 ఎకరాల ప్రభుత్వ భూమి అందజేయడం సంతోషంగా ఉంది. నేను కూడా రైతు అయినట్లే. ఎమ్మెల్యే కాటసాని సాయం మరువం.

– ఎం భవాణి, లబ్ధిదారురాలు, పలుకూరు గ్రామం, బనగానపల్లె మండలం

ఆనందంగా ఉంది



నాకు ప్రభుత్వం నుంచి జగనన్న భూ పంపిణీ కింద రెండు ఎకరాలు ఇవ్వడం ఆనందంగా ఉంది. నేను నా భర్త హరికృష్ణ వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ప్రభుత్వం భూమి ఇవ్వడంతో నేను కూడ రైతునయ్యా. పేదలకు మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ సీఎం కావాలి. జగనన్నతోపాటు ఎమ్మెల్యేకాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు.

– హేమలత, లబ్ధిదారురాలు, రామతీర్థం గ్రామం, బనగానపల్లె మండలం

శ్రీ కృష్ణ బృందావనంలో వనభోజనం

బేతంచెర్ల: స్థానిక నంద్యాల రహదారిలోని వెలసిన శ్రీ కృష్ణ బృందావనంలో ఆదివారం మండల గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం శ్రీ కృష్ణునికి పూజలు చేసి, కార్తీక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం నాయకులు మురళీగౌడు, నాగ సురేంద్ర, వెంకటేశ్వర్లు, లోకేష్, మోహన్, రామన్ గౌడు తదితరులు పాల్గొన్నారు.



ఉసిరిక చెట్టుకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కోవెలకుంట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల అభ్యున్నతికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సయ్యదు న్నీసా, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని సొదరదిన్నె గ్రామంలో వికసిత భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రభుత్వ పథకాల అమలును స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు వర్తింప చేస్తున్నాయన్నారు. అనంతరం అయుష్మాన్ భారత్ పథకం కింద మంజూరైన హెల్త్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాధిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, డాక్టర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.



హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

హోరాహోరీగా బండలాగుడు పోటీలు




పోటీలను ప్రారంబిస్తున్న పోచా శీలా రెడ్డి

సంజామల: మండల పరిధిలోని అక్కంపల్లె సమీపంలో వెలసిన నయనాలప్ప క్షేత్రంలో కడ సోమవారం ఉత్సవాలను పురస్కరించకుని ఆదివారం బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆరు, ఆరుపండ్లలోపు కోడెల విభాగంలో ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్, అనంతపురం తదితర జిల్లాలకు చెందిన 12 జతల వృషభాలు పోటీల్లో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రచార విభాగ జోనల్ ఇన్‌చార్జ్ పోచా శీలారెడ్డి పోటీలను ప్రారంభించారు. కర్నూలు జిల్లా వెంకటగిరికి గ్రామానికి చెందిన సుశాంక్ శ్రీయ వృషభాలు 5,586 అడుగులాగి ప్రథమ స్థానం నిలిచి రూ.30 వేలు కై వసం చేసుకున్నాయి. వైఎస్సార్ జిల్లా తాడిగొట్ల గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి వృషభాలు 5,400 అడుగులులాగి రెండవ స్థానం రూ.20వేలు, ఇంద్రారెడ్డి, చెన్న కేశవ రెడ్డి ఉమ్మడి జత 5,120 అడుగులులాగి మూడవ స్థానం రూ.15 వేలు దక్కించుకున్నాయి. నరసమ్మ, దాసరపల్లి ఉమ్మడి జత 5,110 అడుగులులాగి నాల్గవ స్థానం రూ.10 వేలు, షన్విత రెడ్డి, రాంభూపాల్ రెడ్డి ఉమ్మడి జత 5,100 అడుగులులాగి రూ. 5 వేలు కై వసం చేసుకున్నాయి. గెలుపొందిన వృషభరాముల యజమానులకు నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, నాగేశ్వర్ రెడ్డి,శివా రెడ్డి, వెంకటక్రిష్ణ రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న మొక్క జొన్న

బనగానపల్లె : రెండేళ్లుగా మొక్క జొన్న సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. బనగానపల్లె నియోజకవర్గంలో వ్యవసాయబోర్ల కింద రబీలో సుమారు 5వేల హెక్టార్లలో ఈ పంటను సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. గతేడాదితో పాటు ఈ ఖరీఫ్‌లోనూ ఎకరానికి 30–35 క్వింటాళ్ల దిగుబడి లభించింది. క్వింటాం రూ.2100 - 2200 వరకు గిట్టుబాటు ధర లభించడంతో రబీలోనూ అధిక విస్తీర్ణంలో మొక్కజొన్నను సాగు చేశారు రైతులు. ఎకరానికి సేద్యం, రసాయన, క్రిమి సంహారక మందులు, వ్యవసాయ కూలి తదితరాలకు దాదాపు రూ.20వేల వరకు ఖర్చు వస్తుంది. గిట్టుబాటు ధర లభిస్తుండడంతో ఖర్చులు పోను మిగులు రూ.30–40వేలు ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రబీలో సాగు చేసిన మొక్క జొన్న

ఐకమత్యంగా మెలగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని హోటళ్లు, టీ స్టాల్స్, బేకరీల నిర్వాహకులు ఐకమత్యంగా మెలగాలని, తనవంతు సహాయ సహకారాలు అందజేస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కాశయ్యతోటలోని ఆయుర్వేదవైద్యశాల ఆవరణలో బనగానపల్లె హోటల్స్, టీ స్టాల్స్, బేకరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. బనగానపల్లె పట్టణంలో జరిగిన రోడ్ల విస్తరణకు హోటల్స్, టీ స్టాల్స్‌తో పాటు ఇతర వ్యాపారస్తులు సహకరం అభినందనీయమన్నారు. ఆక్రమణాల తొలగింపు కారణంగా రోడ్డు అభివృద్ధి పనులు కొంత మేర అలస్యమైందని, దీనిని కూడా ప్రతిపక్ష పార్టీ నాయకులు రాజకీయం కోసం ఉపయోగించుకోవడం శోచనీయమన్నారు. వచ్చే ఏడాది తాను అన్ని కులాల వారితో కలిసి కార్తీక భోజన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితోపాటు సోదరుడు, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో సీఐ తిమ్మారెడ్డి, జిల్లా వైస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, పట్టణ వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ ఫైజ్, హోటల్స్ టీ స్టాల్స్ బేకరీస్ అసోసియేషన్ నాయకులు హైదర్, సజ్జాద్, నాగరాజు, సుబ్బరాయుడు, శ్రావణ్, షరీఫ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత చాటుకోవాలి

డోన్ రూరల్ : మదాసి కురువ, మదారి కురువలు ఐక్యత చాటుకోవాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు తిరుపాల్, ఉల్‌తప్ప, శేఖరయ్య తెలిపారు. మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామం వద్ద ఆదివారం మదాసికురువ, మదారి కురువ వన భోజన కార్యాక్రమం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఎం.కె.వెంకటప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ వచ్చేంత వరకు పోరాడాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమంత్, రామిరెడ్డి, శ్రీనివాసులు, రాంభూపాల్‌డు, తగిరి వెంకటరాముడు, సభ్యులు పెద్దయ్య, శేఖర్, రాంమూర్తి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



చేతులు కలిపి ఐక్యత తెలుపుతున్న సంఘం నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అవుకు: మండల కేంద్రం అవుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1984–1985(పదవ తరగతి) బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఒకే చోట చదువుకున్న చిన్ననాటి స్నేహితులు ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారు. వీరంతా ఒకే వేదిపై చేరారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరిస్తూ యోగక్షమాలపై ఆరా తీసుకున్నారు. పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు పార్వతీశం, పక్కీర రెడ్డి, సుబ్బరాయుడు, దర్బాకుల భాస్కర్ శాస్త్రిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాయునంద గౌడ్, జి.వి. సుబ్రమణ్యం,వేటూరి రమణ, రామ సుబ్బయ్య, మధుసూధన్, కోళ్ల శ్రీను, రహీం, రామ్మోహన్ తదిరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు వాయునంద గౌడ్, జీవీ సుబ్రహ్మణ్యం, వేటూరి రమణ, రామ సుబ్బయ్య, మధుసూదన్, కోళ్ల శ్రీను, రహీం, రామ్మోహన్ తదిరులు పాల్గొన్నారు.



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

నేడు పట్టణంలో మంత్రి బుగ్గన పర్యటన

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్ల పట్టణంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం పర్యటిస్తారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి ఆదివారం తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు పట్టణంలోని సంజీవనగర్, జంగాలపేట, హనుమాన్ నగర్ కాలనీల్లో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. మంత్రి పర్యటనను ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల కింద జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

సంజామల: మండల పరిధిలోని సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట ఏడు గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్లకు సంబంధించిన గ్రామాలలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరుకు, పేరుసోముల సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 5 నుంచి 12 వరుకు విద్యుత్ సరఫర ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు.

19న గోవిందుని కల్యాణోత్సవం

డోన్ : స్థానిక వేంకటేశ్వర ఆలయంలో ఈనెల 19వ తేదీన గోవిందస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ స్వామి తెలిపారు. గోవింద మాలధారుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఆలయ ప్రధాన ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామోత్సవం ఉంటుందని, భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని తెలిపారు.

ప్రభుత్వాలు గ్రామాల పురోభివృద్ధికి కృషి



సిమెంట్ నగర్‌లో గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ

బేతంచెర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలపురోభివృద్ధికి కృషి చేస్తున్నాయని సిమెంట్ నగర్ సర్పంచ్ ఏస్తేరమ్మ, ఉప సర్పంచ్ మమత, బుగ్గానిపల్లె తండా సర్పంచ్ ఆదిలక్ష్మి బాయి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా, సిమెంట్ గ్రామంలో ప్రత్యేక అధికారి అజయ్ కుమార్, ఎంపీడీఓ వెంగన్న, ఈఓ ఆర్డీ వెంకట రంగనాయక్, వైద్యురాలు మెహతా బేగం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈసందర్బంగా గ్రామాల అభివృద్ధితోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. పెద్ద స్క్రీన్ పై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ఉచిత గ్యాస్ కనెక్షన్లను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సోమశేఖర్, ఏపీఓ శేషన్న , గ్రామ నాయకులు యకోబ్, యోబ్, శంకరయ్య, బాబా, సచివాలయ కార్యదర్శి రాజేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

డోన్: ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులు, బాలింతలు, వారి సహాయకులకు ఆదివారం రాధాక్రిష్ణ స్వీట్‌షాప్ ఆర్థిక సాయంతో పౌష్టికాహారం పంపిణీ జరిగింది. హోసన్నా ప్రార్థన సంస్థ నిర్వాహకులు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రోగులకు రొట్టె, గుడ్డు, పప్పు అందజేశారు. దాతలకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు దేవరాజ్, మనోహర్‌లు పాల్గొన్నారు.

భక్తులతో మహానంది కిటకిట



నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న ఈఓ, పండితులు

మహానంది: కార్తీకమాసం, త్రయోదశి, ఆదివారం సెలవురోజు కలిసి రావడంతో మహానంది క్షేత్రం భక్తులతో పోటెత్తింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. వేకువజామున 4.30 గంటల నుంచి రాత్రి ఏకాంత సేవ వరకు మహానందీశ్వరస్వామి దర్శనం నిర్విరామంగా కొనసాగింది. వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహానందీశ్వరస్వామి దర్శనం కోసం ఆర్జిత సేవలైన శీఘ్ర దర్శనం, సాధారణ దర్శనం క్యూలైన్లలో గంటల తరబడి బారులు తీరారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. భక్తులరద్దీకి అనుగుణంగా ఆలయంలో రెండవ ప్రసాదాల విక్రయకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు వేకువజామున 4.30 గంటలకే మహా మంగళ హారతులు చేపట్టారు.